యుద్ధం ముగిసేదెన్నడు?

- ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరుకు ఏడాది పూర్తి
- గాజాలో దారుణ పరిస్థితులు.. వేల మంది మృతి
- ఇరాన్, హెజ్బొల్లా జోక్యంతో పెరిగిన ఉద్రిక్తతలు
- రణ రంగంగా పశ్చిమాసియా.. ప్రపంచం ఆందోళన

జెరూసలేం/ గాజా, అక్టోబర్ 6: గత ఏడాది అక్టోబర్ 7న పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం ఏడాది కాలంగా రావణ కాష్ఠంలా రగులుతూనే ఉంది. పరస్పరం ప్రతీకార దాడులతో కొనసాగుతున్న పోరు సామాన్యులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నది. యుద్ధం వల్ల గాజాలో వేలాది మంది మృతి చెందగా.. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనా తరపున యుద్ధంలో ఇరాన్, హెజ్బొల్లా జోక్యం చేసుకోవడంతో హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. పశ్చిమాసియా రణ రంగంగా మారింది. దీనిపై ఐరాసతో పాటు ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యుద్ధ విరమణకు అవి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ యుద్ధం గాజా, పాలస్తీనా, లెబనాన్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. హమాస్ ఆరోగ్య శాఖ ప్రకారం ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 41,700 మంది మరణించారు. యుద్ధం మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా ఇప్పటిదాకా జరిగిన ముఖ్యమైన ఘటనలను, పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం..

హమాస్ దాడితో ఆరంభం

గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ ఫైటర్లు ఇజ్రాయెల్‌పై దాడి చేయడంతో 1205 మంది చనిపోయారు. ఇందులో ఎక్కువ మంది సామాన్య పౌరులే. ఈ ఘటనలో హమాస్ 251 మందిని బందీలుగా గాజాకు తీసుకెళ్లింది. ఇందులో ఇప్పటికీ 64 మంది నిర్బంధంలోనే ఉన్నారు. 117 మందిని విడిచిపెట్టారు. 70 మంది మరణించారు. దీంతో హమాస్‌ను అంతమొందిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రతిజ్ఞ చేశారు.

గాజాపై భూతల దాడులు

అక్టోబర్ 13న ఉత్తర గాజాలోని ప్రజలు దక్షిణ ప్రాంతం వైపు తరలి వెళ్లాలని ఇజ్రాయెల్ హెచ్చరించింది. అక్టోబర్ 27న భూతల దాడులు ప్రారంభించింది. నవంబర్ 15న గాజాలోని అతిపెద్ద దవాఖాన అల్-షిఫాపై ఇజ్రాయెల్ దాడి చేసింది.

గతేడాది డిసెంబర్ 8న గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన దృశ్యం

బందీల మార్పిడి

నవంబర్ 24న హమాస్-ఇజ్రాయెల్ మధ్య చర్చలు జరిగాయి. ఒప్పందం ప్రకారం హమాస్ 80 మంది ఇజ్రాయెల్ పౌరుల్ని విడిచి పెట్టగా, తమ దేశ జైళ్లలో ఉన్న 240 పాలస్తీనియన్లను, 25 మంది ఇతర బందీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు

డమాస్కస్‌లోని తమ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి ప్రతీకారంగా ఏప్రిల్ 13న ఇరాన్ ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. అయితే వాటిలో చాలావాటిని ఇజ్రాయెల్ సమర్థంగా అడ్డుకొంది.

గాజా దక్షిణ ప్రాంతంపై దాడులు

మే 7న చాలా మంది శరణార్థులు తల దాచుకున్న గాజా దక్షిణ ప్రాంతంలోని రఫా నగరంపై ఇజ్రాయెల్ సైన్యం భూతల దాడులు ప్రారంభించింది. ఈజిప్ట్‌తో సరిహద్దు కలిగి ఉన్న ప్రాంతాన్ని తన అధీనంలోకి తీసుకొని సాయం అందే మార్గాన్ని దిగ్బంధం చేసింది. జూలై 13న హమాస్ సైన్యాధిపతి మొహమ్మద్ డైఫ్‌ను అంతమొందించినట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

భయం రేపిన ప్రాంతీయ హింస

ఇరాన్ అండ కలిగిన హౌతీ రెబెల్స్ సాయంతో యెమెన్ టెల్ అవీవ్‌పై చేసిన దాడికి ప్రతిగా జూలై 20న ఇజ్రాయెల్ యెమెన్‌పై దాడి చేసింది. ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దుల్లో ఇరాన్ మద్దతు కలిగిన హెజ్బొల్లా-ఇజ్రాయెల్ మధ్య దాదాపు ప్రతిరోజూ పరస్పరం కాల్పులు చోటు చేసుకున్నాయి. జూలై 30న బీరుట్‌పై జరిగిన దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఫాద్ షుక్ర్ మరణించారు. ఆ తర్వాతి రోజే హమాస్ రాజకీయ నాయకుడు ఇస్మాయిల్ హనియహ్ ఇరాన్‌లో జరిగిన ఒక దాడిలో చనిపోయారు. దీనికి ఇజ్రాయెలే కారణమని హమాస్ ఆరోపించింది.

సంధి చర్చలు విఫలం

ఆగస్టు 16న అమెరికా ప్రతిపాదించిన కొత్త సంధిని హమాస్ తిరస్కరించింది. ఆగస్టు 22న ఈజిప్ట్, ఖతార్ చర్చలకు మధ్యవర్తిత్వం వహించినా అవి విఫలమయ్యాయి. ఆగస్టు 25న లెబనాన్‌పై పెద్ద యెత్తున దాడి చేశామని ఇజ్రాయెల్ ప్రకటించగా.. వందలాది డ్రోన్లు, రాకెట్లను ఇజ్రాయెల్‌పై ప్రయోగించామని హమాస్ తెలిపింది.

లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల కలకలం

సెప్టెంబర్ 17, 18న లెబనాన్‌లో వేలాది మంది హెజ్బొల్లా సభ్యుల పేజర్లు, వాకీటాకీలు పేలి కనీసం 39 మంది మృతి చెందగా, మూడు వేల మంది గాయపడ్డారు. దీనికి తామే బాధ్యులమని ఇజ్రాయెల్ ప్రకటించకపోయినా గాజాపై యుద్ధాన్ని విస్తరిస్తామని ప్రకటించింది. లెబనాన్‌పై బాంబు దాడులు కొనసాగించింది. సెప్టెంబర్ 27న దక్షిణ బీరుట్‌పై దాడి చేసి హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను మట్టుపెట్టింది.

ప్రత్యక్షంగా రంగంలోకి ఇరాన్

నస్రల్లా మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రతిన బూనారు. నస్రల్లా, హనియా మృతికి బదులు తీర్చుకొనేందుకు అక్టోబర్ 1న ఇజ్రాయెల్‌పై ఇరాన్ వందలాది క్షిపణులతో విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లో పరిమితంగా భూతల దాడులు చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించిన రోజే ఈ దాడి జరిగింది.

మసీదులో మృతులు, గాయపడినవారి కోసం వెతుకుతున్న స్థానికులు

అగ్నిగుండంలా పశ్చిమాసియా

- దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లుతున్న ప్రాంతం
- గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 24 మంది మృతి
- దక్షిణ బీరుట్‌పైనా ఐడీఎఫ్ వైమానిక దాడులు
- ఇజ్రాయెల్‌పై రాకెట్లతో విరుచుకుపడ్డ హమాస్

బీరుట్, అక్టోబర్ 6: పశ్చిమాసియాలో ఉద్రిక్తత మరింత పెరిగింది. అటు ఇజ్రాయెల్, ఇటు హెజ్బొల్లా, హమాస్‌లు ఎవరికి వారు వెనక్కి తగ్గకపోవడంతో దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తరగాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 24 మంది మరణించారు. శనివారం ఇజ్రాయెల్ దళాలు తొలిసారిగా లెబనాన్‌లోని ట్రిపోలి నగరంపై దాడులు జరిపాయి. మరో పక్క ఇజ్రాయెల్‌పై దాడులు జరిపి ఏడాదైన సందర్భంగా గాజా నుంచి హమాస్ ఆదివారం ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు చేసింది.

హెజ్బొల్లాకు మరోషాక్

హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా మృతితో గట్టి షాక్‌లో ఉన్న హెజ్బొల్లాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్టు తెలిసింది. మరో కరుడుగట్టిన నేత, నస్రల్లా వారసుడు సఫీద్దీన్, ఇరాన్ కమాండర్ ఇస్మాయిల్ కూడా మరణించినట్టు ప్రచారం జరుగుతున్నది. హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హత్య తర్వాత ఆయన వారసుడిగా హషేమ్ సఫీద్దీన్ బాధ్యతలు చేపడతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. గురువారం దక్షిణ బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన మరో దాడిలో సఫీద్దీన్ మృతి చెందినట్టు వార్తలు వస్తున్నాయి.

ఉత్తర గాజాలో 24 మంది మృతి

ఉత్తర గాజాలో ఇజ్రాయెల్ వాయుసేన జరిపిన దాడిలో 24 మంది మృతి చెందారు. ఆదివారం ఒక మసీదు, స్కూల్ లక్ష్యంగా జరిపిన ఈ దాడిలో 24 మంది మృతి చెందగా, 93 మంది గాయపడ్డారు. కాగా, యుద్ధం కారణంగా గాజా స్ట్రిప్‌లో నిరాశ్రయులైన వారు ఇందులో తలదాచుకుంటున్నారని రాయిటర్స్ సంస్థ తెలిపింది.

ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ కమాండర్ మృతి?

ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఖుద్స్ ఫోర్స్ కమాండర్ ఇస్మాయిల్ ఘనీ జాడ కొన్ని రోజులుగా తెలియడం లేదు. శుక్రవారం బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడి అనంతరం ఆయన కన్పించడం లేదని, బహుశా ఆ దాడిలో ఆయన మరణించి ఉండవచ్చునని కొన్ని టర్కీ, ఇజ్రాయెల్ వార్తా సంస్థలు వెల్లడించాయి. మరోవైపు ఇజ్రాయెల్ దాడిచేయొచ్చన్న భయాల నేపథ్యంలో ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది.

జాడ లేని హమాస్ చీఫ్

ఇజ్రాయెల్ వరుసగా ఉగ్ర సంస్థల అగ్రనేతలను హతమారుస్తుండటంతో హమాస్ చీఫ్ యాహ్యా సిన్వార్‌కు భయం పట్టుకుంది. దీంతో ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఎవరితోనైనా మాట్లాడితే ఎక్కడ తన ఆచూకీ కనిపెట్టేస్తారో అన్న భయంలో ఆయన ఖతారీ మధ్యవర్తులతో కనీసం ఫోన్‌లో కూడా మాట్లాడటం లేదని ఖతారీ అధికారులను ఉటంకిస్తూ ఎన్12 వార్తా సంస్థ తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా ఇజ్రాయెల్ బందీలను తన ప్రాణాలకు కవచంగా ఉంచుకున్నారని వెల్లడించింది.

పేజర్ల పేలుడు వెనక 9 ఏండ్ల ప్లాన్

న్యూఢిల్లీ: పేజర్లు, వాకీ టాకీలు పేలి హెజ్బొల్లాకు చెందిన 30 మంది మృతిచెందగా, వేలమంది గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ పేలుడు వెనుక ఇజ్రాయెల్ 9 ఏండ్ల ప్రణాళిక ఉన్నదట. వాషింగ్టన్ పోస్ట్ నివేదిక ప్రకారం.. 2015లో ఇజ్రాయెల్‌కు చెందిన స్పై ఏజెన్సీ మొస్సాద్ ఈ ఆపరేషన్ చేపట్టింది. 'భవిష్యత్తులో హెజ్బొల్లాతో ఇబ్బందులు తలెత్తితే పేజర్లు, వాకీ టాకీలనే బాంబుగా మార్చే సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఇందుకోసం 9 ఏండ్లు శ్రమించారు. ఎక్కువ చార్జింగ్ ఇచ్చే పేజర్లు, వాకీ టాకీలను తయారుచేయాలని నిర్ణయించి, లావైన బ్యాటరీలను చేర్చి.. పేలుడు సంభవించే సాంకేతికతతో తయారుచేశారు. అంటే.. అవి రెండు చేతులతో పట్టుకొనేలా ఉంటాయి. ఎందుకంటే.. పేలుడు సంభవిస్తే రెండు చేతులూ పోవాలన్న ఉద్దేశంతోనే. ఇక, అందులోనే మెసేజ్ డీ-ఎన్‌క్రిప్షన్ వ్యవస్థను కూడా చేర్చారు. సర్వేలెన్స్ కూడా ఉండదని నమ్మించి వారి చేతుల్లో పెట్టారు. అయితే, ఈ పేజర్ల ఎంపికలో ఉగ్రవాదులు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ఇజ్రాయెల్‌తో సంబంధం లేని దేశాల వద్దే వీటిని కొనుగోలు చేయాలనుకున్నారు. అందుకే తైవాన్‌కు చెందిన అపోలో పేజర్లు ఆర్డర్ పెట్టారు. ఆ కంపెనీ పేజర్లు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవి. తైవాన్ కంపెనీకి చెందిన మహిళ మధ్యప్రాచ్య దేశాలకు సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసింది. ఆ సమయంలోనే హెజ్బొల్లాకు కావాల్సిన పేజర్లు, వాకీటాకీలు సరఫరా చేశారు. కానీ, అది ఇజ్రాయెల్ ఆపరేషన్ అన్న విషయం ఆ మహిళకు కూడా తెలియదు' అని వాషింగ్టన్ పోస్ట్ కథనంలో పేర్కొన్నది.

జానీ మాస్టర్‌కు జాతీయ

అవార్డు నిలిపివేత

న్యూఢిల్లీ: ఇప్పటికే లైంగిక దాడి ఆరోపణలతో అరెస్టయిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్రం గతంలో అతనికి ఇచ్చిన జాతీయ అవార్డును నిలిపివేస్తున్నట్టు అవార్డుల కమిటీ ప్రకటించింది. జానీ మాస్టర్‌పై పోక్సో చట్టం కింద వచ్చిన తీవ్ర ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని 2022లో తిరుచిత్రబలం చిత్రానికి అతనికి ప్రదానం చేసిన ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు జాతీయ అవార్డుల కమిటీ ప్రకటించింది. అలాగే ఈ నెల 8న న్యూఢిల్లీలో జరిగే 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం కోసం ఆయనకు పంపిన ఆహ్వానాన్ని కూడా ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపింది. కాగా, ఈ అవార్డుల ఫంక్షన్‌కు హాజరవ్వడానికి తనకు బెయిల్ ఇవ్వాలంటూ జానీ మాస్టర్ చేసిన విజ్ఞప్తిని గురువారం సిటీ కోర్టు అంగీకరించి, ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

అలాచేస్తే బీజేపీకి ప్రచారం చేస్తా: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లోగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉచిత కరెంటిస్తే బీజేపీ తరపున ఢిల్లీ ఎన్నికల్లో తాను ప్రచారం చేస్తానని ప్రధాని మోదీకి ఆప్ అధినేత కేజ్రీవాల్ సవాల్ విసిరారు. నవంబర్‌లో జార్ఖండ్, మహారాష్ట్రతో పాటు ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించాలని, ఇందుకు ఆప్ సిద్ధంగా ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలో జనతా కీ అదాలత్‌లో కేజ్రీవాల్ మాట్లాడుతూ 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలంటే రెట్టింపు అవినీతి, రెట్టింపు దోపిడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం. మీరు పొరపాటున బీజేపీకి ఓటేస్తే మీకు మా సర్కారు ఉచితంగా అందిస్తున్న విద్యుత్తు, నీళ్లు, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థయాత్రలు, ఆరోగ్యం, విద్య అదృశ్యమైపోతాయి' అని కేజ్రీవాల్ అన్నారు.

దివాలా దిశగా అమెరికా: మస్క్

వాషింగ్టన్: అమెరికాలో రోజురోజుకు పెరుగుతున్న జాతీయ రుణ భారంపై ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆల్-ఇన్-పాడ్‌కాస్ట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా వేగంగా దివాలా దిశగా వెళ్తున్నదని అన్నారు. అమెరికాలో నెలకొన్న ఆర్థిక సవాళ్లపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, రోజురోజుకు జాతీయ రుణం, వడ్డీల చెల్లింపు భారం అధికమవుతున్నదని చెప్పారు. దేశం చేసిన రుణాలపై వడ్డీలే ఈ ఏడాది ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయని, దేశంలో వసూలు చేసిన పన్నుల్లో 76% వాటి చెల్లింపులకే సరిపోతున్నదని తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే అమెరికా దివాలా తీస్తుందని చెప్పారు.

దసరా తర్వాత సిద్ధరామయ్య రాజీనామా!

కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర వ్యాఖ్యలు

మైసూరు: 'ముడా' స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్యపై కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. దసరా తర్వాత సిద్ధరామయ్య తన సీఎం పదవికి రాజీనామా చేయవచ్చునని అన్నారు. ఆదివారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ, 'రోజూ మీడియా ముందుకు వచ్చి తానే సీఎం అని సిద్ధరామయ్య చెప్పుకునే పరిస్థితి ఉంది. దసరా తర్వాత ఏ క్షణమైనా సీఎం పదవికి ఆయన రాజీనామా చేయొచ్చు! అని అన్నారు.

మహిళ కడుపులో 2 కిలోల వెంట్రుకలు

సర్జరీ చేసి తొలగించిన వైద్యులు

లక్నో : తీవ్రమైన కడుపునొప్పితో దవాఖానకు వచ్చిన ఓ మహిళ(21)కు వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించగా.. ఆమె పొత్తి కడుపులో 2 కిలోల వెంట్రుకలు ఉన్నట్టు గుర్తించారు. సర్జరీ చేసి ఆ వెంట్రుకల్ని తొలగించారు. ఈ ఘటన గత నెల 26న ఉత్తరప్రదేశ్‌లో బరేలీ జిల్లా దవాఖానలో చోటుచేసుకుంది. బాధిత మహిళకు వెంట్రుకలు తినే అలవాటుందని, ఇదొక మానసిక రుగ్మతగా వైద్యులు పేర్కొన్నారు.

శబరిమల ప్రసాదంలో క్రిమి సంహారకాలు

తిరువనంతపురం: తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందన్న వివాదం ఇటీవల తీవ్ర సంచలనం సృష్టించగా, ఇప్పుడు మరో ప్రసాదంపై వివాదం రేగింది. శబరిమల ప్రసాదం అరవణలో కల్తీ జరిగిందని, మోతాదుకు మించి క్రిమిసంహారకాలు కలిశాయన్న విషయం బయటకు వచ్చింది. దీంతో ఈ అరవణను ఎరువుగా మార్చనున్నారు. శబరిమల అయ్యప్ప దేవాలయంలోని 6.65 లక్షల కంటైనర్లలో ఈ ప్రసాదం గత ఏడాదిగా వాడకుండా ఉంది. ప్రసాదం తయారీలో ఉపయోగించిన యాలకుల్లో ఆమోదించదగ్గ స్థాయి కన్నా ఎక్కువగా క్రిమిసంహారకాలు కలిసినట్టు వచ్చిన ఆరోపణల వల్లే వీటి వాడకాన్ని నిలిపివేశారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండటానికి టీడీబీ దానిని శాస్త్రీయ విధానంలో పారబోసేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్‌ను ఇండియన్ సెంట్రిఫ్యుజ్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్ పొందిందని, వారు కలుషితమైన ప్రసాదాన్ని ఎరువుగా మారుస్తారని టీడీబీ చైర్మన్ ప్రశాంత్ తెలిపారు.

చెన్నై మెరీనా బీచ్‌లో ఎయిర్ షోకు భారీగా తరలివచ్చిన సందర్శకులు

చెన్నై ఎయిర్ షోలో విషాదం.. ఐదుగురు సందర్శకుల మృతి

దవాఖానపాలైన వందల మంది.. అస్తవ్యస్త ఏర్పాట్లపై విమర్శలు

చెన్నై, అక్టోబర్ 6: చెన్నైలో జరిగిన ఎయిర్ షోలో విషాదం చోటు చేసుకుంది. ప్రదర్శన చూడటానికి వచ్చిన పౌరుల్లో ఐదుగురు మరణించగా, 230 మంది దవాఖాన పాలయ్యారు. భారత వైమానిక దళం 92వ వార్షిక దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకుని చెన్నై మెరీనా బీచ్‌లో నిర్వహించిన ఈ ప్రదర్శనకు 15 లక్షల మంది హాజరయ్యారు. అయితే తీవ్ర ఎండ వేడికి తోడు, లక్షలాది మంది హాజరు కావడంతో పలువురు డీహైడ్రేషన్‌కు గురయ్యారు. ఈ ఎయిర్ షో ద్వారా లిమ్కా రికార్డు నెలకొల్పుతామని ప్రకటించిన నిర్వాహకులు దానికి తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. పోలీసుల వైఫల్యం వల్ల నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడ్డాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత అక్కడి నుంచి వెళ్లే క్రమంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రయాణికులతో రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయింది. చాలా మంది వృద్ధులు, మధ్య వయస్కులు ప్రదర్శన ప్రారంభం కాకముందే స్పృహతప్పి పడిపోవడం కన్పించింది. దీనికి తోడు మంచినీటిని అమ్మేవారిని అక్కడి నుంచి తొలగించడంతో ప్రజలు దాహంతో అల్లాడారు. తీవ్ర ఎండకు తాళలేక పలువురు రోడ్డు పక్కన కూలబడిపోవడం కన్పించింది. స్థానిక నివాసితులు వచ్చి వీరికి మంచినీరు అందించడంతో తేరుకున్నారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులు కనీస ఏర్పాట్లు, అవసరాలను విస్మరించారని పలువురు మండిపడ్డారు.

వీడియో కాల్స్ ద్వారా అరెస్టులు జరగవు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న ఐ4సీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: దేశంలో 'డిజిటల్ అరెస్టు'లకు సంబంధించిన నేరాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) శనివారం ఓ అడ్వైజరీని జారీ చేసింది. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కస్టమ్స్, పోలీస్ అధికారులు లేదా జడ్జీలు వీడియో కాల్స్ ద్వారా ఎవరినీ అరెస్టు చేయరని ఆ అడ్వైజరీలో స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్టులను కుంభకోణం (స్కామ్)గా పేర్కొన్నది. ఇంటర్నెట్‌తోపాటు వాట్సాప్, స్కైప్ లాంటి సోషల్ మీడియా వేదికలు, వాటి లోగోలను ఉపయోగించడం ద్వారా జరిగే ఇలాంటి నేరాల బారిన పడొద్దని ప్రజలకు సూచించింది. డిజిటల్ అరెస్టులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

కెనడాలో వెయిటర్ ఉద్యోగాల కోసం వేల మంది భారతీయుల క్యూ

న్యూఢిల్లీ: మెరిసేదంతా బంగారం కాదని మరోమారు రుజువైంది. విదేశాలకు వెళ్తున్న మన వాళ్లంతా సుఖపడిపోతున్నారని, రాజభోగాలు అనుభవిస్తున్నారని అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం మరోటి ఉండదని తాజాగా రుజువైంది. కెనడాలోని బ్రాంప్టన్‌లో ఉన్న తందూరి ఫ్లేమ్ రెస్టారెంట్‌లో వెయిటర్, సర్వర్ ఉద్యోగాలకు 3 వేల మంది భారతీయ విద్యార్థులు క్యూ కట్టడం అక్కడి దారుణ పరిస్థితులను కండ్లకు కడుతున్నది. కిలోమీటరు పొడవున్న లైనులో ఉద్యోగార్థులు నిలబడి ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 'మేఘ్ అప్‌డేట్స్' ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఈ వీడియో.. కెనడాలో చదువు, ఉద్యోగాలు కోరుకునే యువతకు ఈ వీడియో కనువిప్పు కలిగిస్తుందన్న చర్చ మొదలైంది. కొత్తగా ప్రారంభించబోయే రెస్టారెంట్ వెయిటర్, సర్వెంట్ జాబ్స్‌కు వేసిన అడ్వర్టైజ్‌మెంట్‌కు వచ్చిన రెస్పాన్స్ ఇదని అందులో పేర్కొన్నారు. ఎన్నో కలలతో కెనడాకు వెళ్లే భారతీయ విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ వీడియో నొక్కి చెప్తున్నది. మాంద్యం తరుముకొస్తున్న వేళ విదేశాలకు వెళ్లకపోవడమే బెటరని కొందరు సలహా ఇస్తున్నారు.

భోపాల్‌లో 1800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో రూ.1800 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టుబడింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, గుజరాత్ ఏటీఎస్ సంయుక్త ఆపరేషన్ నిర్వహించి ఈ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. భోపాల్ సమీపంలోని ఓ పరిశ్రమపై నిర్వహించిన దాడిలో ఈ భారీ డ్రగ్ రాకెట్‌ను గుర్తించారు. ఈ ఫ్యాక్టరీలో మెఫెడ్రోన్ డ్రగ్ తయారు చేస్తున్నట్టు గుర్తించారు. అక్రమంగా డ్రగ్స్ తయారీకి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. దేశ రాజధానిలో వారం క్రితం సుమారు రూ.5 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొన్న విషయం తెలిసిందే. ఇంతలోనే భోపాల్‌లోనూ భారీగా డ్రగ్స్ పట్టుబడటం గమనార్హం.

12 రకాల క్యాన్సర్లను గుర్తించే రక్త పరీక్ష

బ్రిటన్‌లో అందుబాటులోకి

లండన్, అక్టోబర్ 6: ఎన్నో రకాల ఆరోగ్య సమస్యల్ని గుర్తించటంలో 'రక్త పరీక్ష' చాలా కీలకం. 12 రకాల సాధారణ క్యాన్సర్లను కూడా ముందుగా పసిగట్టే 'గేమ్ ఛేంజింగ్' అనదగ్గ రక్త పరీక్ష బ్రిటన్‌లో అందుబాటులోకి రాబోతున్నది. క్యాన్సర్ లక్షణాలు రోగిలో బయటపడక ముందే ఈ రక్త పరీక్ష వ్యాధిని బయటపెడుతుందని తెలిసింది. తద్వారా కొన్ని లక్షలాది మంది క్యాన్సర్ రోగులకు ప్రాణాపాయం తప్పుతుందని, స్కానింగ్‌లు, టెస్టుల కోసం కొన్ని నెలలపాటు రోగుల సమయం వృథా కాకుండా చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. బ్రిటన్ ఆరోగ్య మంత్రి వెస్ స్టీరింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో దేశవ్యాప్తంగా 'సార్వత్రిక' రక్త పరీక్షలను ఈ ఐదేండ్లపాటు అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. ఈ పథకం కోసం 2.5 మిలియన్ పౌండ్ల (సుమారుగా రూ.27.56 కోట్లు) నిధులను బ్రిటన్ ప్రభుత్వం కేటాయించింది. సార్వత్రిక రక్త పరీక్ష పథకం అమలులో స్టార్టప్ కంపెనీ 'ఎక్స్‌జెనెరా' ప్రభుత్వానికి సాయం చేయనున్నది. ఊపిరితిత్తులు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, మూత్రాశయ క్యాన్సర్.. ఇలా 12 రకాల సాధారణ క్యాన్సర్లను గుర్తించే రక్త పరీక్షకు సంబంధించి ఒక రోగికి 120 పౌండ్లు (రూ.13 వేలు) ఖర్చు అవుతుందట.

మైక్రో ప్లాస్టిక్ ముప్పు లేని పీవీసీ

న్యూయార్క్ : పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి ప్రమాదంగా మారుతున్న మైక్రో ప్లాస్టిక్ ముప్పు లేని కొత్త పాలివినైల్ క్లోరైడ్(పీవీసీ)ని అమెరికాలోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వచ్ఛమైన పీవీసీ వేడిని తట్టుకోలేదు. అందుకే తయారీదారులు పలు రసాయనాలను ఉపయోగించి పీవీసీతో ఉత్పత్తులను తయారుచేస్తారు. ఈ రసాయనాలు కొంతకాలానికి బయటకు వచ్చేస్తాయి. ఫలితంగా పీవీసీ నుంచి మైక్రోప్లాస్టిక్‌లు పర్యావరణంలోకి విడుదలవుతాయి. ఈ సమస్యకు పరిష్కారంగా శాస్త్రవేత్తలు పీవీసీ ఉత్పత్తుల తయారీకి కొత్త రసాయన ఫార్ములాను తయారుచేశారు.

అంటార్కిటికాలో పరుచుకుంటున్న పచ్చదనం

- తగ్గుతున్న మంచు విస్తీర్ణం
- పెరుగుతున్న వృక్షజాలం
- యూకే పరిశోధకుల వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: అంటార్కిటికా అంటే మంచుతో కప్పి ఉండే కొండలతో నిండి ఉండే తెల్